సుబ్బారావుకి ఆ రోజు పట్టపగ్గాల్లేకుండా ఉంది. ఏవేవో ఊహిస్తున్నాడు. ఎంతకీ వాటికోరూపం రావడం లేదు. ఆ ఊహ జిలేబీ పాకంలా సాగుతోంది. కారణం ఆరోజు బోనస్ రావడమే! కొత్త సంవత్సరం మొదటి రోజు. ఆ కారణంగా ఆ కంపెనీలో లాభాలు వచ్చినందుకు వాళ్ళు నిజాయతీగా ఆ కష్టఫలాన్ని అందరికీ పంచారు.

సుబ్బారావు ఓ చిన్న ఉద్యోగి. భార్యా ఇద్దరు పిల్లలూ ఉన్నారు. వారికి వచ్చే ఎనిమిది వందల రూకల జీతమూ బొటీబొటీగా సరిపోతూంది పన్నెలూ, చెన్నెలూ లేకుండా.

అలాంటి పరిస్థితిలో ఎంత చిన్నదయినా బోనస్ లాంటి బహుమతులు ఎక్కువే వారి జీవితంలో.

అందుకే అతనలా నేల మీద నడవకపోవడం! ఆఫీసు నుండి బయట పడుతూనే ముందుగా స్వేచ్ఛా వాయువులు పీల్చాడు. ఎప్పుడూ వికారంగా, రాక్షసంగా, జైలులో కనిపించే ఆఫీసు భిల్డింగు, చాలా మందగా, హుందాగా, స్టైల్‌గా కనబడుతోందతనికీ రోజు.

ఆప్యాయంగా అన్నంపెట్టే కన్న తల్లిలా కనిపిస్తోంది.

నువ్వే లేకపోతే నేనేమై పోదునో కదా అనుకున్నాడు.

అప్పుడే చంద్రుణ్ణి పైకి తీసుకురావాలనే తపనతో సూర్యుడు క్రుంగిపోతున్నాడు.

రోజూ అయితే 'చీకటి పడ్తూన్నప్పుడు కానీ నాకు విముక్తి లేదు కదా' అనుకునేవాడు. కానీ, అప్పుడు మాత్రం అలా అనుకోవడం లేదు. ఈ దృశ్యం చూడడానికి నేనెంత అదృష్టం చేసుకున్నానో కదా అనుకున్నాడు.

సుబ్బారావు వచ్చే దారిలో చేమంతి పూలు కనిపించాయి. 'ఆహా చెప్పకుండా పువ్వులు తీసుకెళ్తే సుశీల ఎంత సంతోషిస్తుందో' అనుకున్నాడు. ఆ సంతోషాన్ని తలుచుకుని తనే మురిసిపోతూ ఓ రూపాయి పెట్టి చేమంతి, గులాబీ, మరువం వేసి దండ కట్టించి తీసుకున్నాడు.

ఇంకో రెండడుగులు వేసేసరికి ఎదర స్వీటుషాపు. అరకిలో స్వీటు తీసుకున్నాడు.

నడిచి వెడితే ఈ కబురు సుశీలకి చెప్పడానికి ఇంకా ఆలస్యమైపోతుందని రిక్షా బేరమాడాడు.

ఆఘమేఘాల మీద ఇంటికి చేరుకున్నాడు.

వస్తూనే సంతోషంగా చెప్పాడు సుశీలతో, ఆ శుభ వార్త కాస్తా.

ఆలుమగలు ఇద్దరూ ఆనందంలో మునిగి తేలారు.

వారి బడ్జెట్ ఎంతకి తెమలలేదు.

దాంతో ఏం చేయాలి? ఏం చేస్తే అది సద్వినియోగమవుతుంది?

పోనీ, అప్పులో కొంత కట్టేద్దామా?


అయ్యో! అది కాస్తా అందులో కట్టేస్తే సంతోషమేముంది?

ఆది కాస్తా అసలు ఇదే బేడనుకో, ఇదే పావలా అనుకో, ఇదే రూపాయి అనుకో అన్నట్లు అన్నింటికీ వచ్చేస్తే ఏ ఇబ్బందీ ఉండదు!

అలా కాదు కనుకే ఈ బాధంతాను.

ఆఖరికి అందరికీ ఉపయోగ పడేట్లుగా ఏదో ఒక బట్ట అందరికీ తీసుకోవాలన్న దాంతో ఆ ప్రణాళిక ముగిసింది.

ఈ రోజు సరదాగా ఓ సినిమాకి వెళ్ళి వద్దామని ఆ పని కూడా చేసేశారు.



ఎంత! ఎంతే! వచ్చాక చూసుకునే నరికి తేలింది.

మొత్తం బోనస్ 150 రూపాయల్లో, 35 స్వీటుకీ, మిగిలినవి ఖర్చయిపోయాయని.

ఇంక పిల్లలగా మిగిలినదంతా ఖర్చయిపోకుండా పిల్లలు రేపు వెంటనే తీసుకోవాలని నిశ్చయించుకుని హాయిగా నిద్రపోయారు.

*  *  *

తెల్ల వారింది. శుభోదయం, నవోదయం, నంవత్సరంలో తొలి ఉదయం వచ్చింది. ఆహ్లాదంగా.

భార్యా భర్తలిద్దరూ, పిల్లలిద్దరూ గుడ్ మార్నింగ్ చెప్పుకుంటూ లేచారు పక్కల మీదనుండి.

మొట్టమొదట పనిమనిషి నత్తెమ్మ తన డ్యూటీలో దిగింది.

వాళ్ళకి పాల వాడు ప్రొద్దుట 8 గంటలకు గానీ రాడు. అందుకనే కాఫీల కోసమని ఓ పావు పాలు రాత్రి పోయించుకుంటారు. వీటితోనే కాఫీ కాచి అందరికీ ఇచ్చి నత్తెమ్మకి కూడా ఇచ్చింది సుశీల.

వెను దిరగ బోతుంటే "అమ్మగారూ" అంటూ ఆప్యాయంగా పిలిచింది నత్తెమ్మ.

"ఏంటీ చెప్పు" అంది సుశీల.

"ఒక్కసెనం కూర్చోండమ్మగారూ, మీరు నిలబడుంటే నాకు మాట రాదండీ" అంది అది.

"ఏమిటో చెప్పవే! అవతల పనుంది. వంట తొందరగా చెయ్యాలివ్వాళ" అంది సుశీల. తొందరగా చేసేసి బజారుకెళ్లాలి అని మనసులో అనుకుంటూ తప్పనిసరిగా కూర్చుంటూ.

"అది కాదండీ, మరేమోనండీ"

"నసక్క తొందరగా తెమల్చవే"

"మరేమోనండీ కొత్త నంవత్సరం కదండీ"

"అయితే ఏ విటీ, మధ్యాహ్నాం సెలవు తీసుకుంటావా"

"అబ్బె ఊరు కోండమ్మగారూ, నాకల్లాంటి వేమీ లేవు, ఓపికున్నంత వరకూ ఒక్క పూట కూడా మానాలనిపించదు నాకే వీ" అంది నత్తెమ్మ.

"మరింకేవిటీ?" అంది ఆశ్చర్యంగా సుశీల.

"మరేమోనండీ కొత్త నంవత్సరం కదండీ.. నాకేమీ ఈ నామిప్పించరాండీ?"

"ఈనామా, అదేవి లేవ్, మా కొన్నున్నాయా ఈ నాములు?"

"అది కాదండమ్మగోరూ, ఈపాలికి మీరూ కాదంటే వల్లకాదండీ, అందరి దగ్గర తలో పాతిక అడుక్కుని, 150 రూపాయలైతే అదీదే చిల్కండ కొనుక్కుందామండీ".

"ఓసినీ అభాంతరం కూలా, పాతిక రూపాయలంటే తేలిగ్గా వచ్చాయంటే నీకు."

"ఏంటమ్మగోరూ, మరీ అలాగంటారు. నేనింకా 50 రూపాయలు అడుగుదారనుకుని మీరివ్వగలరో లేదోనని పాతికే అడిగినానండి" అంది గునుస్తూ నత్తెమ్మ.

"ఊఁ, నీ కివ్వకపోతే ఊరుకోవు కదా, రేపటి నుండి పని మానేస్తే మళ్ళీ నాకే బాధ" అంటూ 20 రూపాయలు తెచ్చి ఇచ్చింది.

"ఇదే ఉంది తీసుకో, ఏదో అడిగేవు కదాని ఇచ్చేను కానీ నా దగ్గర లేవసలు" అంటూ.

"చల్లటమ్మగోరు, నాకు తెల్దేటండి" నత్తెమ్మ మెల్లగా జారుకుంది.

*  *  *

"అయ్యగోరూ, అయ్యగోరూ"

"ఆఁ ఎవరు"

"నేనేనండయ్యా గోరూ, రామయ్యానండి"

"అదేవిట్రా రామయ్యా! ఇప్పుడొచ్చావేవిట్రా ఈ రోజు క్షవరం అక్కర్లేదు వెళ్ళు".

"అది కాదండయ్యా గోరూ, ఈ రోజు కొత్తఏడాది కదండీ, అందుకని".

"ఊఁ అందుకని?"

"అందుకని ఈ నామేమన్నా ఇప్పిస్తారేమోనండయ్య".

"ఒర్నీ కొత్త నంవత్సరమొస్తే ఈనామేవిట్రా" అంటూ వెర్రిమొహం వేసేసేడు.

"అలాగని కండయ్య గోరూ, కనీసం పదేను రూపాలన్నా ఇప్పించండయ్యా గోరూ, పొది బాగు చేసుకోవాల"

"ఒర్నీ పొది బాగుకు పదిహేను రూపాయలవుతుందట్రా, నీకు మతేమన్నా పోయిందా, ఈనామంటే ఏదో ఇస్తారు గానీ వదులూ, పదిహేన్లూ మీకేఁవన్నీ తెలుస్తాందేవిట్రా" అన్నాడు సుబ్బారావు, రానురానూ ఉక్రోషం వచ్చేస్తోంది

నోటికొచ్చిన కూడు పోతుందే అని. ఆఖరికి పది రూపాయలిచ్చి వంపక తప్పలేదు.

ఉన్నూరు మంటూ కూలబడి పోయాడు.

*  *  *



"అమ్మగారూ, పాలు పోయించుకోండి" అన్నాడు పాల మనిషి వెంకయ్య.

పాలు పోయించుకుని ఇంట్లోకి వెళ్తూంటే,

"అమ్మగోరూ, అయ్యగోరు లేరాండీ".

"ఏఁవిట్రా అయ్యగారితో ఏం పని?" అంది సుశీల కంగారుని కనిపించనియ్యకుండా.

"అయ్యగోరుంటేనండీ, ఓ ఇరవయిప్పించ మనండమ్మగోరూ".

"ఎందుకురా ఇప్పించమనడం? నువ్వు పోసే నీళ్ళ పాలకా?"

"అలాగంటారేటండమ్మ గోరూ, దూడ పెయ్యి బాలేదండి".

"అయ్యగారికి కూడా మనను బాలేదురా"

"అలాగనకండమ్మ గోరూ, మీరివ్వకపోతే దూడ చచ్చిపోతుందండి".

"మేఁవే దొరికావట్రా నీకు, నువ్వింకా పాలు పోస్తావు కదా, వాళ్ళ నడుగు".

"అదికాదండమ్మగోరూ, ఇంకా వేరే కూడా అడిగి తీసుకెడతానండి.

"సుశీలా, వాడడిగిందేదో ఇచ్చేసి పొమ్మనవతలకి. వెధవ గొడవాని, మూడ్ అంత తగలేసారు. ఇంకా ఉంచి చేసేదేమీ లేదు" అన్నాడు కోపంగా.

*  *  *

"నాన్నా నాన్నా" అంది బేబీ

"ఏమ్మా, బేబీ ఏం కావాలి?"

"మరేమోనూ మన దగ్గర డబ్బులన్నీ అయిపోయాయా నాన్నా".

"అదేంటమ్మా, నీకేంకావాలో చెప్పు, నా బంగారు తల్లివిగా".

"మరీ, అన్నీ అయిపోతే నీకు బాధగా ఉంటుంది కదూ".

"అయ్యో! నా చిట్టితల్లీ, అడ్డమైన వాళ్ళకీ ఇచ్చాను. నీ దగ్గరకు వచ్చేసరికి లేదంటానా, చెప్పమ్మా".

"మరీ, మా స్కూల్లో మా టీచరూ కొత్త పుస్తక మేదో రాసి ప్రింటు చేయించిందట. తమ్ముణ్ణి ఒకటీ నన్నొకటీ కొనుక్కోమంది. కొనుక్కోకపోతే కొడతానంది. ఇంకానూ, హేండీకేప్డ్ వాళ్లకి నిధి ఏదో పోగు చేస్తున్నారుట. ఇద్దర్నీ కలిపి 25 రూపాయలు దానికి తెమ్మంది. లేకపోతే రేపు స్కూలుకి రానియ్యనంది నాన్నా".

"అయ్యో, నా బంగారుకొండ, నిన్నలా అందామ్మా, తీసికెళ్ళు. ఏదన్నా ముందు అవసరం గడుపుకోవాలిగా, ఇది చెప్పడాని కింత అనుమానమెందుకమ్మా, నాతో కాకపోతే ఇంకెవరితో చెప్తావు నువ్వు".

"సారీ నాన్నా".

"థాంక్యూ బేబీ, థాంక్యూ".

*  *  *

"సార్ ఉన్నారా!".

"ఆఁ ఎవరండీ, ఏం కావాలి?".

"మేం సోషల్ వెల్ఫేర్ నుండి వచ్చామండి".

"ఆఁ అయితే ఏమిటి".

"మీరూ చందా ఇవ్వాలండీ! ఆ ఎదురింటి సార్ 116 రూ.లు ఇచ్చారండి, ఈ పక్కాయనేమో అర్ధనూట పదహార్లు ఇచ్చారండీ, ఇదిగో చూడండి కావలిస్తే ఈ ఛార్ట్, 25 రూపాయలకి ఎక్కడా తక్కువ లేదు".

"నాయనా! వాళ్ల ముందర తక్కువయినా నా పరువే మీ పొదు. అసలు నాకు పరువే లేదు. ఈ పది రూపాయలు తీసుకొని నన్నొదిలెయ్యండి, వెళ్లండింక".

"ఈయనెవరో పిచ్చిముండా కొడుకల్లే ఉన్నాడ్రా".

*  *  *

మెల్లగా తెల్లవారింది. యాంత్రికంగా పనులయి దిగులుగా కాళ్లు ఈడ్చుకుంటూ ఆఫీసుకు వెళ్లాడు సుబ్బారావు.

ఈ రోజు కనీసం జీతమయినా అందుకుందాం అనుకుంటూ.

కానీ, ఇచిన జీతం చూసుకుని తెల్లమొహం వేశాడు.

అతని తెల్లమొహం చూసి హెడ్ క్లర్క్ పళ్లికిలించాడు.

"హి హి హీ, సుబ్బారావూ, అదే మోయ్ అలా చూస్తావు. మొన్న బోనస్ ఇచ్చారు కదా! అందులో యూనియన్ ఖర్చుకి కట్ చేసుకోవడం మరిచి పోయారుట. అందుకని అందరికీ 300 రూపాయలు కట్ చేశారుట. అందుకే నీకు 500 రూపాయలే ఇచ్చారు" అన్నాడు.

"హి హి హీ బోనస్ అంటూ నవ్విన సుబ్బారావుని చూసి ఈసారి తెల్లబోవడం అతని వంతయింది.

●